మహిళలు స్వయం కృషితో ఎదగాలి

ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : మహిళలు అన్ని రంగాల్లో స్వయం కృషితో ఎదిగేందుకు ప్రయత్నించాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇది ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏది లేదనా ఎందరో నిరూపించారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మనమంతా సమాజానికి మంచి చేయాలని తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళల రక్షణకు, సంరక్షణకు ఎన్నో చట్టాలను ప్రభుత్వం చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మహిళా సంరక్షణ కోసం కొత్త చట్టాలను రూపొందించారని, దిశ యాప్ దేశానికే ఆదర్శమని అని అన్నారు. మహిళా జర్నలిస్టు అజిత మాట్లాడుతూ విద్యార్థినులు స్వశక్తితో ఎదిగేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. మహిళలు విభిన్న రంగాల్లో ఎదుగుతూ మిగతా వారికి చేయూతనందించాలన్నారు. ఏఎస్పీ ప్రేరణకుమార్ మాట్లాడుతూ మహిళలు ఎలాంటి సమస్య ఎదురైనా ప్రభుత్వం అన్ని రకాలుగా రక్షణ కల్పిస్తోందన్నారు. ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో ఏ సమస్య వచ్చినా నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేయవచ్చునని, దిశ యాప్ ద్వారా సామాచారం అందించవచ్చన్నారు. సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభకనబరిచిన మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, వికసిత ఫౌండేషన్ డైరెక్టర్ శూలం శివప్రసాద్, వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ, ప్రముఖ డాక్టర్లు వరలక్ష్మి, నూరి పర్వీన్, బ్రహ్మకుమారి హేమ, ఫౌండేషన్ సభ్యులు శిరీష, రవిప్రసాద్, భారతి పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన మహిళలను సన్మానిస్తున్న నిర్వాహకులు

వినూత్న ఆలచనలతో కొత్త ఆవిష్కరణలు

పురుషుల కంటే మహిళలే వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలను చేయగలరని ఏఎస్పీ ప్రేరణ కుమార్ తెలిపారు. స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆత్మ గౌరవంతో, స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకోగలుగుతున్నారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయం, క్రీడలు, బ్యాకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి రంగాల్లో మహిళలు విశేష ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మదర్ థెరిసా, కల్పన చావ్లాలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో పరులకు, దేశానికి సేవ చేయాలని కోరారు. విశిష్ట అతిథి సాఫ్ట్‌వేర్ సీనియర్ మేనేజర్‌కేఎస్ఎన్ తేజశ్వని మాట్లాడుతూ సమాజం నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మహిళా శక్తి భవనంలో మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలను నిర్వహించారు. మెప్మా టీఈ కెజియా జాస్లిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి విరసం రాష్ట్ర మాజీ కార్యదర్శి వరలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమంలో సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

గోపవరం : మండలంలోని భాగ్యలక్ష్మీ ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని బద్వేలు ఏడీఏ ఎం.నాగరాజ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టాకు రిజిస్టర్లు పరిశీలించి దుకాణంలో ఉన్న స్టాకును తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని సూచించారు. పురుగు మందులు, ఎరువుల ధరల పట్టికను అందుబాటులో ఉంచాలని, కాలం తీరిన పురుగు మందులను ఎట్టిపరిస్థితుల్లో దుకాణంలో ఉంచరాదని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు, పురుగు మందులను అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని తెలిపారు.

ఎన్నికలు పకబడ్బందీగా నిర్వహించాలి

ప్రొద్దుటూరు : ఎన్నికలను బకడ్బందీగా నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ కృష్ణ తెలిపారు. ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 16 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కడప నుంచే పోలింగ్ బాక్స్‌లను సరఫరా చేస్తామన్నారు. మొత్తం 32 మందిని పోలింగ్ ఆఫీసర్లుగా నియమించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగునికి ట్రై సైకిల్ వితరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంజామలకు చెందిన జనార్ధన్ అనే దివ్యాంగునికి ఏఎస్పీ ప్రేరణకుమార్ చేతుల మీదుగా ట్రైసైకిల్‌ను అందచేశారు. ఈ సందర్భంగా దివ్యాంగునికి ఫౌండేషన్ వారు ట్రైసైకిల్‌ను, రూ3వేలు ఆర్థిక సహాయం అందివ్వడం అభినందనీయమన్నారు. వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వివేకానంద సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసి, సంస్థ ప్రతినిధి వెంకట సురేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం

ప్రొద్దుటూరు : స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో ఉన్న అమ్మానాన్న మదర్ థెరిసా వృద్ధాశ్రమంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా 400 మందికి అల్పాహారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి హాజరై అల్పాహారం వడ్డించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు హిదాయత్, కార్యదర్శి ఫక్రుద్దీన్, కౌన్సిలర్ వద్ద ఖలీలుల్లా, కరీముల్లా, వేంపల్లి గౌస్, నూరి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

చేతిరాతపై అవగాహన

పోరుమామిళ్ల : పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్రముఖ చేతిరాత నిపుణులు మల్లేశ్వరరెడ్డి చేతిరాతపై అవగాహన కల్పించారు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు మెలుకువలు తెలుపుతూ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ఏప్రిల్ 2న దేవాంగ కల్యాణ మండపం పాలకవర్గ ఎన్నికలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణ మండపలో కల్యాణ మండపం పాలకవర్గ ఎన్నికలను ఏప్రిల్ 2న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, విశ్రాంత అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.ఓబుళరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 31 మంది కార్యవర్గ సభ్యులు ఉంటారని, వీరిలో గౌరవాధ్యక్షులు ఆరుగురికి ఎన్నిక ఉండదన్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు ఐదుగురు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు ఐదుగురు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, కోశాధికారి, సహాయ కోశాధికారి, డైరెక్టర్లు 10 మందికి గాను ఎన్నిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నామినేషన్లు ఈ నెల 18, 19 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు స్వీకరిస్తారని, 20న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ, ఏప్రిల్ 2న ఎన్నిక ఉంటుందన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు అర్థ రహితం

బద్వేలు అర్బన్ : బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధపై కొన్ని ఛానళ్లు, పత్రికల్లో తప్పుడు కథనాలు ప్రచురించడం సరికాదని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సి.నారాయణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు డాక్టర్ శ్రీనులు పేర్కొన్నారు. మంగళవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేకు చెందిన స్థలాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులే కబ్జా చేశారని, దీనిపై ఎమ్మెల్యే కడప ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు ప్రసారం చేసిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఎమ్మెల్యే తన సొంత పని మీద ఆర్డీఓను కలిస్తే ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు కథనాలు ప్రసారం చేయడం దారుణమన్నారు.

వర్షపు నీటిని కాపాడుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి వర్షపునీటి బొట్టును కాపాడుకోవాలని నెహ్రూయువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ మణికంఠ పేర్కొన్నారు. స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో మంగళవారం నేషనల్ వాటర్ మిషన్ మినిస్ట్రీస్ ఆఫ్ జల్‌శక్తి ఆదేశంతో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో క్యాచ్‌ది రైన్ అనే కార్యక్రమం జరిగింది. వర్షపునీటిని సంరంక్షించేందుకు, నీటిని పొదుపుగా వాడేందుకు రూపొందించన కరపత్రాలను ఆవిష్కరించారు.

రైతు ఆత్మహత్యలపై విచారణ

దువ్వూరు : మండల పరిధిలోని ఇడమడక, పెద్ద బాకరాపురం గ్రామాల్లో 2022 మే– ఆగస్టు నెలల్లో ఆత్మహత్యలపై మంగళవారం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. ఇడమడక గ్రామానికి చెందిన అక్కిశెట్టి భైరవుడు, పెద్దబాకరాపురానికి చెందిన ధనిరెడ్డి కొండారెడ్డి అనే రైతులు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్డీఓ ఆయా గ్రామాలకు వెళ్లి వారికి ఉన్న అప్పులు, కుటుంబ పరిస్థితులపై విచారించారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్‌బీఐ, ఎల్ఐసీ ద్వారా అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడులు పెట్టడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మైదుకూరురోడ్డులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్యామలాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు అచ్యుతరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహబూబ్‌బాష, బీసీ విభాగం కో ఆర్డినేటర్ గురప్ప, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు చదవాలి భవిష్యత్తును మలచుకోవాలి

మైదుకూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఖాజామొయినుద్దీన్

మైదుకూరు : ఆడ పిల్లలు బాగా చదువుకొని తమ భవిష్యత్తును చక్కగా మలచుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. స్థానిక మేధా డిగ్రీ కాలేజిలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆడ పిల్లలకు చదువే సంరక్షణ, ఆలంబన అన్నారు. బ్యాక్‌బెంచీలో ఉన్నా చదువుకుంటే జీవితంలో స్థిరపడతారని పేర్కొన్నారు. బాల్య వివాహాలు పోయి చట్ట ప్రకారం పెళ్లీడు వచ్చిన తర్వాతనే ఇప్పుడు వివాహాలు జరుగుతున్నాయన్నారు. గర్భంలో ఉన్నప్పుడే తండ్రి ఆస్తిలో సోదరులతో సమానంగా ఆస్తి పంచుకొనే హక్కును చట్టం కల్పించిందన్నారు. తహసీల్దార్ అనురాధ మాట్లాడుతూ మహిళా సాధికారతకు అర్థం వివరించి, ఆడ పిల్లలు తమ చదువు, ఉద్యోగం, కుటుంబం విషయంలో స్వయం నిర్ణయాధికారం కలిగి ఉండేలా తయారు కావాలని తెలిపారు. అర్బన్ ఎస్ఐ మధ్దిలేటి దిశ యాప్, పోక్సో చట్టం గురించి వివరించారు. సహాయ ప్రభుత్వ ప్లీడర్ నరసింహ శర్మ, న్యాయవాదులు నానుబాల శ్రీనివాసులు, జేకే చారి మాట్లాడారు. ప్యానెల్ అడ్వకేట్ సోమేసుల శివరామ్ సదస్సును నిర్వహించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ఏవీ రమణ, సంయుక్త కార్యదర్శి దేవేంద్ర, కరీముల్లా, కళాశాల చైర్మన్ సావిత్రి, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది రమణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఖాజా మొయినుద్దీన్

హరే రామ.. హరే కృష్ణ

- ఘనంగా గౌర పౌర్ణమి వేడుకలు
- 30 వేల మందికి అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : హరే రామ.. హరే కృష్ణ అంటూ భక్తులు చేసిన హరినామ సంకీర్తన మారుమ్రోగింది. గౌరపౌర్ణమి సందర్భంగా స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం రాత్రి ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో గౌర పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ, బలరామ దేవతా విగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భజనలు, కీర్తనలు, హారతి, మహా పుష్పాభిషేకం, భగవద్గీత ప్రవచనాలు, మహా హారతి తదితర పూజా కార్యక్రమాలు మధురేసు దాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 30వేల మందికిపైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డిలతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీకృష్ణ, బలరాములకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రొద్దుటూరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షత వలన మహిళలు విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు రాలేకపోతున్నారన్నారు. ఈ వివక్షతను రూపుమాపడానికి విద్యాలయాల నుంచే ప్రారంభం కావాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఉమెన్ ఎంపవర్ మెంట్ కన్వీనర్ నిర్మలాదేవి మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

నేడు ఎన్జీఓహోంలో

ప్రొద్దుటూరు క్రైం : మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు ఎన్జీఓహోంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ఎన్జీఓ అసోసియేషన్ కార్యదర్శి జె రామసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2, 3వ తేదీల్లో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలు

పోరుమామిళ్ల : మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారని గైనకాలజిస్ట్ డాక్టర్ మృదుల తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు అధ్యక్షతన ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ సులోచన ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు దృఢసంకల్పంతో సమస్యలు దాటుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళా దినోత్సవం, హోలీ సంబరాలు

చాపాడు : స్థానిక ఇంటర్నేషల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్‌లో ఆవరణలో విద్యార్థులు రంగులు చల్లుకున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ప్రొద్దుటూరు : ఈనెల 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని స్కాలర్స్ హైస్కూల్, దీప్తి జూనియర్‌కాలేజి, గీతాంజలి హైస్కూల్‌లో ఎమ్మెల్యే ప్రచారం చేశారు.

చాపాడు మండలంలో..

చాపాడు : ఈ నెల 13న జరుగనున్న పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సోమాపురం పంచాయతీలోని సోమాపురం, మొర్రాయిపల్లె, నాగాయపల్లె, సోమాపురం దళితవాడ, ఉప్పలకొట్టాల గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు.

వెన్నపూసకు మద్దతుగా విస్తృత ప్రచారం

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూసరవీంద్రారెడ్డికి మద్దతుగా మంగళవారం పట్టణంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డిల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా సురేంద్రనగర్, గుంతపల్లె, కుమ్మరికొట్టాలు, తొట్టిగారిపల్లె సచివాలయాల పరిధిలోని పట్టభద్రుల వద్దకు వెళ్లి వెన్నపూసకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

బి.మఠంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

బ్రహ్మంగారిమఠం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మంగళవారం బి.మఠం మండలంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డిల ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ముందుగా ముడుమాల, పలుగురాళ్ళపల్లె, టి.చౌదరవారిపల్లె, మలుగుడుపాడు, డి.నేలటూరు, దిరసవంచ, నాగిశెట్టిపల్లె పంచాయతీలలో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. మండలం నుంచి అత్యధిక మెజార్టీ సాధిస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



















